ఇంటింటికీ తాగునీరు!

- జల్‌జీవన్ పథకం కింద గడప గడపకూ కుళాయి
- బనగానపల్లె నియోజకవర్గంలో రూ. 79 కోట్లతో ముమ్మరంగా సాగుతున్న పనులు
- ఇప్పటికే కొన్ని పల్లెల్లో కుళాయిల ద్వారా నీటి సరఫరా
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు

బనగానపల్లె: ప్రజల వద్దకే పాలన లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ అందరి మన్ననలు పొందుతోంది. గడప గడపకు నేరుగా సేవలు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రజల ఆశీస్సులు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంటింటికీ తాగునీరు అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు అధికారులు. బనగానపల్లె నియోజకవర్గంలోని 79 గ్రామ సచివాలయాల పరిధిలోని 161 గ్రామాల్లో నీటి సౌకర్యం కల్పించేందుకు ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్ ఏర్పాటుకు దాదాపు రూ.79 కోట్లతో చేపట్టిన 298 అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నియోజకవర్గ కేంద్రం బనగానపల్లెతోపాటు కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, అవుకు, సంజామల మండలాల్లో చేపట్టిన పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయి. దాదాపు యాభైశాతానికిపైగా అభివృద్ధి పనులు పూర్తయ్యాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులతోపాటు ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వడంతో నీటి సరఫరా కూడా జరుగుతోంది. గతంలో కుళ్లాయి కనెక్షన్‌కు నగదు చెల్లించాల్సిన విషయాన్ని గుర్తు చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు ఉచితంగా నీటి సరఫరా చేస్తున్న తీరుపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



భానుముక్కలలోని రవ్వలకొండపై 2.50లక్షల లీటర్ల కెపాసిటీతో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంక్



బనగానపల్లె మండలం తిమ్మాపురంలో కుళాయి ద్వారా నీటిని పట్టుకుంటున్న మహిళ(ఫైల్)

జనాభా మేరకు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌తోపాటు ఉచితంగా నీటి సరఫరా చేసేందుకు పట్టణాలతోపాటు గ్రామాల్లో చేపట్టిన ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతి గ్రామంలో జనాభా మేరకు నీటి ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నారు అధికారులు. మండల కేంద్రాలు మినహా గ్రామాల్లో దాదాపు పూర్తికావచ్చాయి. సుమారు 50వేల జనాభా ఉన్న బనగానపల్లె పట్టణంలో ఒక్కొక్కటి 2.50లక్షల లీటర్ల సామర్థ్యంతో రెండు ఓహెచ్ఎస్ఆర్‌లను రవ్వలకొండ, ఎన్జీఓ కాలనీల్లో రూ. 2.59 కోట్లతో చేపట్టారు. ఏప్రిల్ చివరి నాటికి ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం పూర్తవుతుందని అధికారులు అంటున్నారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను రెండు నెలల కిందట పరిశీలించిన కేంద్ర కమిటీ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో పర్యటించిన సభ్యులు ప్రజలతో నేరుగా మాట్లాడి నీటి సరఫరాపై ఆరాతీశారు. గ్రామీణులు సంతోషం వ్యక్తం చేయడంతో సభ్యులు కూడా సంతృప్తి వ్యక్తం చేశారు.

మండల వారీగా పథకం వివరాలు

మండలం	మొత్తం అభివృద్ధి పనులు	మంజూరు నిధులు కోట్లలో
బనగానపల్లె	98	20.96
కోవెలకుంట్ల	38	14.53
కొలిమిగుండ్ల	61	20.46
అవుకు	53	9.96
సంజామల	48	12.77

ప్రతి ఇంటికీ నీటి సరఫరా



మా గ్రామంలో ఈ పథకం ద్వారా చురుగ్గా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తయిన వెంటనే ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం. గతంలో త్రాగునీటి సమస్య ఉండేది. వేసవి కాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉండేది. పథకం పూర్తయితే తాగునీటి సమస్యే ఉండదు.

– టి హరిత, వెంకటాపురం, సర్పంచ్, బనగానపల్లె మండలం

నీటికష్టాలు పూర్తిగా తీరినట్లే



జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి ఇప్పటికే తాగునీటిని అందిస్తున్నాం. గ్రామంలో ఎక్కడ త్రాగునీటి సమస్య లేదు. ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉచితంగా కుళాయియి కనెక్షన్‌తోపాటు తాగునీరు సరఫరా అభినందనీయం.

– అల్లిసుప్రజ, సర్పంచ్ తిమ్మాపురం, బనగానపల్లె మండలం

చురుగ్గా అభివృద్ధి పనులు



ఈ పథకం ద్వారా నియోజకవర్గంలో మొత్తం 298 అభివృద్ధి పనులకు రూ.79 కోట్ల నిధులు మంజూ య్యాయి. ఇప్పటికే 50శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మిలిగిన పనులు ఆగస్టు నాటికి పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నాం. అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ద్వారా తాగునీటి సమస్య పూర్తిగా తీరుతుంది.

– ఉమాకాంత్‌రెడ్డి, డీఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ బనగానపల్లె

క్లుప్తంగా

విజయ డెయిరీ పథకాలు పాడి రైతులకు వరం



నగదు అందజేస్తున్న కర్నూలు మిల్క్ యూనియన్ బోర్డు డైరెక్టర్ రామలక్ష్మమ్మ

బనగానపల్లె: విజయ డెయిరీ సంస్థ అమలు చేస్తున్న పథకాలు పాడి రైతులకు వరంలాంటివని కర్నూలు మిల్క్ యూనియన్ బోర్డు డైరెక్టర్ రామలక్ష్మమ్మ తెలిపారు. గురువారం మండలంలోని తమ్మడపల్లె గ్రామంలోని విజయ డెయిరీ కేంద్రంలోని 38 మంది పాడి రైతులకు సంస్థ మంజూరు చేసిన రూ.88, 250 బోనస్ నగదును మేనేజర్ మధుసూదన్‌బాబు, సర్పంచ్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో రామలక్ష్మమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయ డెయిరీ సంస్థ పాడి రైతుల అభివృద్ధే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తుందన్నా రు. పాడి రైతులు పశువుల కొనుగోలుకు రా యితీ, రైతు మరణిస్తే బీమా, పశుగ్రాసం సాగు చేసుకునే సబ్సిడీ తదితర పథకాలు అమలు చేస్తుందని వివరించారు. అలాగే నందవరం కేంద్రంలోని 29 మంది రైతులకు రూ.46వేల బోనస్‌ను లీటర్‌కు రెండు రూపాయల ప్రకారం అందజేసినట్లు మేనేజర్ తెలిపారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించండి



బుగ్గానిపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన సోదరుడు వెన్నపూస నరేష్‌రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగ భూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని బుగ్గానిపల్లె, బుగ్గానిపల్లె తాండ గ్రామాల్లో వెన్నపూసకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ వారు కరపత్రాలు అందజేస్తూ విస్తృతంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నాగవెంకటేశ్వర్లు, తిరుమలేశ్వర్‌రెడ్డి, మద్దయ్య, ఆరవేటి శేఖరయ్య, వెంకటేష్ నాయక్, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



నగదు అందజేస్తున్న సర్పంచ్ రమాదేవి

ప్యాపిలి: మండల పరిధిలోని కలచట్ల గ్రామానికి చెందిన తప్పెటి సుధాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద ప్రభుత్వం తక్షణ సాయం మంజూరు చేసింది. ఈ మేరకు రూ. 10 వేలను సర్పంచ్ రమాదేవి గురువారం మృతుడి తల్లి తిమ్మక్కకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ రాఘవి, వలంటీర్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు వసతులు కల్పించాలి



ఎమ్మెల్యే కాటసానికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న అధికారులు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రా మంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే శ్రీ చౌడేశ్వరీదేవి జ్యోతి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ఆయన స్వగృహంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్, మాజీ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వరరెడ్డి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎమ్మె ల్యే కాటసాని మాట్లాడుతూ శ్రీ చౌడేశ్వరిదేవి రాయ బారాది జ్యోతి ఉత్సవాలకు ఏపీ, తెలంగాణతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తారని, అన్ని వసతులు కల్పించాలని సూచించారు. అంతకుముందు ఎమ్మెల్యే కాటసానికి ఈఓ పూలమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుండం నాగేశ్వర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

డోన్ టౌన్: ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గురువారం భారతీయ జనతా పార్టీ సాధించిన విజయాన్ని పురస్కరించుకొని డోన్‌లో నాయకులు సంబరాలు చేసుకున్నారు. పాతబస్టాండ్‌లో ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్మీ రామయ్య, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు భరణీరమేష్, నాయకులు గార్లదిన్నె రమేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: పీఆర్ పల్లి, నల్లమేకలపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యాపిలి ఏఈ వినయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రపల్లిలో జగనన్న కాలనీలో 33 కేవీ లైన్ షిఫ్టింగ్ పనులు చేపడుతున్నందున ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

5న ప్రభుత్వ పెన్షనర్ల సమావేశం

బనగానపల్లెరూరల్: బనగానపల్లె డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పెన్షనర్ల సమావేశం ఈ నెల 5వ తేదీన నిర్వహిస్తునట్లు ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు ఐఎస్ పక్కీరరెడ్డి గురువారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉదయం జరిగే ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఎంపిక ఉంటుందన్నారు. ప్రభుత్వ పెన్షనర్లు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



దస్తగిరి

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి దస్తగిరి జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ప్రకాశం జిల్లా దొనకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనపర్చడంతో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడని హెచ్ఎం సోమశేఖర్ గురువారం తెలిపారు. తెలుగు పండిట్ వైవీఎస్ నారాయణరెడ్డి, పీడీ షెక్షావలి, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

భూసేకరణలో రైతులకు న్యాయం చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

బనగానపల్లెరూరల్: మండలంలోని యనకండ్ల గ్రామంలోని జయజ్యోతి సిమెంట్ పరిశ్రమకు రైల్వే లైన్ ఏర్పాటు చేసేందుకు చేపట్టిన భూసేకరణలో రైతులకు నిబంధనల మేరకు తగిన న్యాయం చేస్తామని డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డి హామీ ఇచ్చారు. గురువారం స్థానిక పొదుపు భవనంలో రైల్వేలైన్ భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులతో అభిప్రాయ సేకరణ, సమస్యలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఈ నెల 28న యనకండ్ల గ్రామంలో జరిగిన భూసేకరణ సర్వే కోర్టు ఉత్తర్వుల మేరకు నిబంధనలను పాటించి చేపట్టామన్నారు. ప్రస్తుతం రైతుల పొలాల్లో సర్వే మాత్రమే చేయడం జరిగిందని, మరోసారి అధికారులు పొలాల్లో పర్యటించి ఏ, ఏ రైతుకు సంబంధించి ఎంత మేర విస్తీర్ణంలో భూమి సేకరణలో పోతుంది...పొలాల్లో వ్యవసాయ బోర్లు ఉన్నాయా...తదితర వివరాలు సేకరిస్తారన్నారు. భూసేకరణ రైతుల సమ్మతి పత్రంతోనే తీసుకోవడం జరుగుతుందని, అసమ్మతి రైతులు మళ్లీ న్యాయస్థానానికి వెళ్ల వచ్చన్నారు. చాలా మంది రైతులు తమకు జయజ్యోతి సిమెంట్ పరిశ్రమ వారు ఇచ్చే నష్టపరిహారం ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరతో ఏ మాత్రం గిట్టుబాటు కాదని, తమ భూములను ఇవ్వలేమని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ రాఘవేంద్ర ప్రసాద్, మండల సర్వేయర్ గీతాగాయత్రి, వీఆర్ఓలు గోపాల్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీకి చెందిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి తదితర నాయకులతో కలిసి గురువారం ఎమ్మెల్యే కాటసాని పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేశారు. మోడల్ స్కూల్, బీసీ గురుకులపాఠశాల, ప్రభుత్వ ఉన్నత, జెడ్పీ బాలుర, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, నెహ్రూ విద్యాసంస్థలను సందర్శించి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. ఆయా పాఠశాలల్లో కాటసాని మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేపట్టిన పథకాలను వివరించారు. 36 ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో వైఎస్సార్‌సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని, పశ్చిమ రాయలసీమపట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నెహ్రూ విద్యాసంస్థల ఎండీ కోడూరు రవితేజారెడ్డి, కరస్పాండెంట్ కమల్‌తేజారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంబటి రవికుమార్‌రెడ్డి, ఈశ్వర్‌నాయక్, శ్రీనివాసులు, నారాయణ, శంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న చైర్మన్ రాజేష్

ఎమ్మెల్సీగా వెన్నపూసను గెలిపించండి

డోన్ టౌన్ : వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కోరారు. పట్టణంలోని రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలో గురువారం ఇంటింటికీ వెళ్లి వెన్నపూస రవీంద్రారరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ యన కోరారు. సేవా గుణం కల్గిన వెన్నపూస లాంటి వ్యక్తులను ఎన్నుకుంటే పట్టభద్రుల సమస్యలు పరిష్కరించేందుకు అంకితభావంతో కృషి చేస్తారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, మిట్టా రవికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీనివాసనగర్ కౌన్సిలర్ల ప్రచారం

వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శ్రీనివాసనగర్‌లో గురువారం కౌన్సిలర్లు దారా హరినాథ్‌రెడ్డి,ఆర్ట్ రమణ, పాలుట్ల రఘురాం, మేకల రాజు, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ విజయ్ కుమార్, నాయకులు దారా ప్రతాప్‌రెడ్డి, బషీర్, మహేష్, సాయి, రంగస్వామి తదితరులు విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులకు కరపత్రాలు పంపిణీ చేశారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ యమున

అవుకు: ఆడపిల్లలకు సాధారణంగానే ఆరోగ్య సమస్యలు అధికంగా వస్తాయని, తగు జాగ్రత్తలు పాటించాలని సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ, ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు వినోద్ కుమార్, యమున సూచించారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆడపిల్లలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రం అవుకులోని కస్తూర్బా విద్యార్థినులకు వారు ఆడపిల్లల ప్రాముఖ్యత, లింగ నిష్పత్తిపై అవగాహన కల్పించారు. అదేవిధంగా మహిళా సంరక్షణ కోసం ప్రభుత్వాలు తీసుకువచ్చిన చట్టాలను, బాల్యవివాహాల వలన కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్ సాహెబ్, తెరిసమ్మ, పీహెచ్ఎన్ మల్లీశ్వరీ, సబ్ యూనిట్ ఆఫీసర్ రత్నాకరాచారి, టీబీ సూపర్‌వైజర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఓం శాంతి సభ్యుల సేవలు అభినందనీయం



శాంతి ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ ప్రియతం రెడ్డి

బేతంచెర్ల: సమాజ మార్పు, శాంతి స్థాపనకు ఓం శాంతి సభ్యులు అందిస్తున్న సేవలు అభినందనీయమని సీఐ ప్రియతం రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో గురువారం శివ జయంతి మహోత్సవాలు నిర్వహించారు. మహా లింగాభిషేకం, అష్ట శక్తుల అలంకరణ, దీప ప్రజ్వలన, శివ పతాక ఆవిష్కరణతో పాటు శాంతి యాత్ర ర్యాలీని సీఐ ప్రారంభించారు. ప్రతిఒక్కరూ శాంతియుత జీవనం సాగించాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారిలు మాధవి, విజయ, ఉషారాణి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

డీజే నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

బేతంచెర్ల: ఉత్సవాలు, ఊరేగింపులు, పెళ్లిలకు నిబంధనలకు విరుద్ధంగా డీజేలను పెడితే కఠిన చర్యలు తప్పవని సీఐ ప్రియతం రెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పట్టణంలోని డీజేల నిర్వాహకులతో సీఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డీజే ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. శుభకార్యాల నిర్వాహకులు మీ దగ్గరికి వచ్చినప్పుడు పోలీసుల అనుమతి విషయాన్ని తెలుపాలని డీజే నిర్వాహకులు సూచించారు. పోలీసుల నిబంధనలు పాటించుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణపై కేంద్రం నిర్లక్ష్యం వీడాలి



ఎమ్మార్పీఎస్ నాయకులకు సంఘీభావం తెలుపుతున్న వాల్మీకి సంఘం నాయకులు

కొలిమిగుండ్ల: ఎస్సీ వర్గీకరణపై కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నిర్లక్ష్యం వీడాలని మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైకే విశ్వనాథ్ హెచ్చరించారు. బీజేపీ తీరును నిరసిస్తూ అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని యర్రగుంట్లలోని తెల్లబండ్ల రవి స్మారక స్థూపం నుంచి ప్రారంభమైన పాదయాత్ర గురువారం రాత్రి కొలిమిగుండ్లకు చేరింది. పాదయాత్ర నాయకులకు ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మాదిగలు ఘనస్వాగతం పలికారు. అదేవిధంగా వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు నరసింహుడుతో పాటు నాయకులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్రం మోసం చేసిందని ఆరోపించారు. పాదయాత్ర మార్చి 15న విజయవాడ చేరుకుంటుందని, వర్గీకరణ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు విజయవాడ నలుదిక్కులా ఉన్న జాతీయ రహదారులను దిగ్బంధం చేయనున్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెద్దమునెయ్య, జిల్లా కన్వీనర్ కోలా కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మహా సభలను జయప్రదం చేయాలి

కోవెలకుంట్ల: నెల్లూరులో ఈ నెల 5,6వ తేదీల్లో నిర్వహించ తలపెట్టిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి శివప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఆ మహా సభలకు సంబంధించిన పోస్టర్లను ఎంఈఓ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీయూఎస్ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలకు నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీపతి, సుబ్బారెడ్డి, రామకృష్ణ, నాగేషుడు, ఉసేనయ్య, సుగుణ, నీరజ, జ్యోతి పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నేరం



సదస్సులో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

కోవెలకుంట్ల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్‌బీసీసీ(సోషల్ బిహేవియర్ చైంజ్ కమ్యూనికేషన్) జిల్లా కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణ శివారులోని గురుకుల, స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలల్లో విద్యార్థినీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడంతో బాల్య వివాహాలు చేస్తున్నారన్నారు. ఇలాంటి వివాహాల మూలంగా తక్కువ బరువు, మానసిక, శారీరక వికలాంగత్వం పిల్లలు జన్మిస్తారన్నారు. కార్యక్రమంలో ఐదవ గ్రామ సచివాలయ మహిళా పోలీసులు నాగశ్రీలత, మహబూబ్ ఉన్నీసా పాల్గొన్నారు.

దేశ నాయకులను స్ఫూర్తిగా తీసుకోవాలి

బేతంచెర్ల: ప్రతి ఒక్క విద్యార్థి దేశ నాయకులను స్ఫూర్తిగా తీసుకోవాలని గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల పరిధిలోని గోరుమానుకొండ తాండ ప్రాథమిక పాఠశాలకు మహాత్మాగాంధీ, నెహ్రూ, అంబేడ్కర్, సుభాష్ చంద్రబోస్, సర్వేపల్లి రాధాకృష్ణ, వివేకానంద, సరస్వతీ మాత చిత్ర పటాలను సర్పంచ్ అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్‌ను హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అభినందించారు.

బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలి

డోన్ టౌన్: అతి తక్కువ ప్రీమియంతో అందిస్తున్న బీమా భద్రతను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ సచింద్రబాబు అన్నారు. ఇటీవల పాముకాటుతో మరణించిన రామకృష్ణ భార్య శ్రీదేవికి గురువారం బీమా సొమ్ము రూ. 10వేలను అందజేశారు. వెంకటనాయునిపల్లె గ్రామానికి చెందిన రామకృష్ణ తమ శాఖలో అకౌంట్ కలిగి ఉండి ప్రమాద బీమా కింద రు.500 చెలిచి ఉండటంతో ఈ పథకం వర్తించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా స్థానిక ప్రధాన స్టేట్ బ్యాంక్‌లో ఈనెల 6వ తేదీ చిల్లర నాణేలు అందజేయనున్నట్లు సచింద్రబాబు తెలిపారు. చిల్లర నాణేలు కావల్సిన వారు బ్రాంచిలో సంప్రదించాలన్నారు. అలాగే చినిగిపోయిన పాత నోట్ల మార్పిడి అవకావం కల్పిస్తున్నామన్నారు.

గర్భిణికి రక్తదానం

డోన్ టౌన్: వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి గ్రామానికి చెందిన గర్భిణి అంబికకు ద్రోణాచలం సేవా సమితి సభ్యుడు యూనిస్ రక్తదానం చేసి ఆదుకున్నాడు. కాన్పు నిమిత్తం డోన్ పట్టణానికి వచ్చిన గర్భిణికి ఓ నెగిటివ్ రక్తం అవసరమైంది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ద్రోణాచలం సేవా సమితి సభ్యుడు బాబాను సంప్రదించగా యూనిస్ స్పందించి రక్త దానం చేశారు. అరుదైన రక్తాన్ని దానం చేసిన యూనిస్‌కు గర్భిణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గూడ్స్ గార్డుకు తీవ్రగాయాలు

బేతంచెర్ల: స్థాని రైల్వే స్టేషన్ సమీపాన గూడ్స్‌రైలు వెనకాల ఉన్న గార్డు గురువారం ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. నంద్యాల నుంచి గుంతకల్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలులో బేతంచెర్ల స్టేషన్ సమీపాన గార్డు షరీఫ్ జెండా ఊపుతూ జారీ గూడ్స్ రైలు కిందపడ్డాడు. ఈప్రమాదంలో ఆయన ఎడమ కాలు కింది భాగాన విరిగింది. గమనించిన రైల్వే స్టేషన్ మాస్టర్ షరీఫ్ ను 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

5న ఉచిత కంటి వైద్య శిబిరం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 5వ తేదీన డోన్ సౌత్‌వెస్ట్ మైనింగ్ లిమిటెడ్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు శ్రీనివాసులు, వీరా, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జశ్వంత్ రెడ్డి, సునీల్ కుమార్ తెలిపారు. స్థానికంగా గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కర్నూలు మోడ్రన్ ఐ హాస్పటల్ వైద్యులు అనిల్ కుమార్, రాజశేఖర్ ఉదయం 9గంటలనుంచి 2గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కంటి పరీక్షల అనంతరం శుక్లాల ఆపరేసన్ అవసరమైన వారికి కర్నూలులో ఉచితంగా ఆపరేషన్, కంటి అద్దాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా కర్నూలు ఆసుపత్రికి రానుపోను ఉచిత రవాణా సౌకర్యం, మందులు, భోజన సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సత్తార్, మాణిక్యం, వీరారెడ్డి, మోహన్ రెడ్డి, కంట్రాక్టర్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ సుబ్బారెడ్డి

బనగానపల్లెరూరల్: రైతులు ధాన్యం మద్దతు ధర కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని కైప గ్రామంలో పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు గాలిహనుమంతరెడ్డి, గ్రామ రైతుల ఆధ్వర్యంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పప్పు శనగ పండించిన రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలంటే ఆర్‌బీకేల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం క్వింటాంకు రూ.5335 మద్దతు ధర ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మేనేజర్ శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.